# తూర్పు పడమరైతే

దాదాపు పదిహేనేళ్ళ క్రితం, 1990 ఆ ప్రాంతంలో, తను తెలుగు సమాఖ్య, బొంబాయిలో కార్యదర్శిగా ఉన్నాడు. పౌరాణిక నాటక సమాజం, విశాఖపట్నం వారిచే 'మయసభ' పద్యనాటక ప్రదర్శన ఏర్పాటు చేశాం. పద్యనాటకానికి మంచి ఏ.సి. హాలు బావుంటుందని 'రవీంద్రనాట్య మందిర్' బుక్ చేశాం. బొంబాయి ఆంధ్రమహాసభలో వారికి బస ఏర్పాటు చేశాం. బొంబాయి చూడాలన్న కుతూహలంతో, ప్రదర్శనకి రెండు రోజుల ముందే నాటక సమాజం వాళ్ళు వచ్చారు. ఓ రోజు బొంబాయి సందర్శన తర్వాత ఓ రోజు నాటకం రిహార్సులు చేయచ్చు అనేది వాళ్ళ పథకం.

దర్శకుడూ దుర్యోధన పాత్రధారి అయిన అప్పన్న మాత్రం హైదరాబాద్‌లో ఏదో రాచకార్యం వెలగబెట్టడానికి, అక్కడే ఆగిపోయాడు. అతని సొంత వ్యాపార రీత్యా, నాటక ప్రదర్శన నిమిత్తం, ఎన్నోసార్లు ఇక్కడికి వచ్చి ఉన్నందున బొంబాయి సందర్శనం అతనికి అక్కర్లేదన్నాడు.

మర్నాడు... పగలు ఒంటి గంటకి రావలసిన బొంబాయి ఎక్స్‌ప్రెస్ రాత్రి ఎనిమిది గంటలకి గాని రాలేదు. అప్పన్నకి మహాసభ ఆవరణ పరిచయమే కాబట్టి, స్టేషన్‌కి

ఎవరినీ పంపలేదు. మహాసభలోనే మేము, నాటక సమాజ సభ్యులు ఆయన రాకకి ఎదురు చూస్తున్నాం. దాదర్ స్టేషన్‌కి ఫోన్ చేస్తే ముంబాయి ఎక్స్‌ప్రెస్ వెళ్ళి అరగంటకు పైగా అయిందన్నారు. మరి అప్పన్న ఇంతవరకు రాలేదేంటి ?

వాన నీటికొరకు చూసే చాతక పక్షుల్లా నాటకసమాజం వారు అప్పన్న కోసం కాచుకు కూర్చున్నారు.

దర్శకుడు, కీలక పాత్రధారి లేకపోతే రిహార్సులెలా చేసేది? మర్నాడు ప్రదర్శన. ఇక ఏం చేసేది? తొమ్మిదైంది. అప్పన్న జాడలేదు. దాదర్ స్టేషన్ నుంచి మహాసభకి రావడానికి పది నిమిషాలు చాలు. మరి గంటైనా ఆయన రాలేదంటే ఏమయుండాలి. రైలెక్కే ముందు, నిన్న రాత్రి హైదరాబాద్ నుండి ఫోన్ చేసిన వాడు, రైలొచ్చి గంటైనా ఇంకా జాడలేడంటే? మాలో ఆందోళన.

దాదర్ స్టేషన్‌కి వెళ్ళినా అంతమందిలో ఎక్కడని వెతికేది? మా ఆరాటం పెరుగుతోంది.

ఫోన్ రింగయింది. ఇంటి నుండి శ్రీమతి...

"అప్పన్న ఫోన్ చేశారు. మహాసభకు రావడంలో దారితప్పారు, వెతికి వేసారి, దాదర్ స్టేషన్‌కి ఎదురుగా ఉన్న "మేఘదర్శన్" హోటల్ దగ్గర ఉన్నాడు. ఎవరినన్నా పంపమన్నాడు."

"ఆయన్ని మహాసభకి ఫోన్ చేయమనాల్సింది."

"ఆయన దగ్గర నంబరు లేదట. నాకూ నోటికి తెలీదు. చూసి చెబుతాననేంతలో ఫోను కట్ అయింది. పబ్లిక్ ఫోన్ నుంచి చేసినట్టున్నాడు."

"ఈసారి ఫోన్ చేస్తే, మహాసభ నంబరు, అడ్రసు ఇవ్వు. నేను ఇప్పుడే దాదర్ 'స్టేషన్'కి బయలుదేరుతున్నాను."

నాటక సమాజం సభ్యుడు నూకరాజు వెంటరాగా ఓ ట్యాక్సీ మాట్లాడుకుని బయలుదేరాను.

"అప్పన్నకి బొంబాయి కొట్టిన పిండటండీ. ఎన్నోసార్లు ఇక్కడికి వచ్చాడట. ఆంధ్ర మహాసభలో ఎన్నో నాటకాలు వేశాడట. అందుకనే ఎవర్నీ స్టేషన్‌కి పంపవద్దన్నాడు." నూకరాజు చెప్పాడు.

"బొంబాయి అంత బాగా తెలిసిన వాడు దారితప్పడమేమిటి? మమ్మల్ని ఇబ్బంది పెట్టడానికి కాకపోతే?" 'మనవాళ్ళకి లేని గొప్పలు చెప్పుకోవడం బాగా అలవాటు.

తమకి తెలీని విషయం లేదంటారు. తమకంతా పరిచయమేనని సొంత డబ్బా కొట్టుకుంటారు. అప్పన్న కూడా అదే బాపతులా ఉంది".

మనసులో మాట బయటకు అనలేని పరిస్థితి. ట్యాక్సీని ఓ చోట పార్కు చేసి దాదర్ స్టేషన్ రెండు వైపులా ఓ అరగంట గాలించాము. స్టేషన్ మాస్టర్ని కలిసి మైక్‌లో ప్రకటించాము. అయినా అప్పన్న అత్తా, పత్తాలేదు. స్టేషన్‌కి పావు కిలోమీటరు వ్యాసంలో ప్రతి హోటలు చూశాము. 'మేఘదర్శన్' అంతుతేలలేదు. అప్పన్న ఏ మేఘాలని దర్శిస్తున్నాడో కాని, మాకు మాత్రం చుక్కలు కన్పిస్తున్నాయి! అలసి, సొలసి, ఓ పబ్లిక్ బూత్ నుండి మహాసభకి ఫోన్ చేశాను.

"అప్పన్నగారు ఇప్పుడే ఆఫీసులో అడుగు పెట్టాడుసార్!" ఆఫీసు మానేజరు మాట, చెవిలో సంగీతం పలికింది. ట్యాక్సీని మహాసభ వైపు త్రిప్పాను. రెండు వందలకి రెక్కలొచ్చాయి. బడ్జెట్‌లో ఇంకా పెరిగింది. అయినా మనసులో నిశ్వాస.

ఆంధ్రమహాసభలో అడుగు పెట్టే సరికి అప్పన్న చుట్టూ జనం. తను ఎలా దారితప్పిందీ, ఎక్కడెక్కడ తిరిగిందీ కళ్ళకు కట్టిన్నట్టు వివరిస్తున్న అప్పన్న. నాటక సభ్యుల మొహాల్లో తిరిగి వచ్చిన కాంతి.

అప్పుడు, ఇప్పట్లా సెల్‌ఫోన్లు ఉంటే అంత మనస్తాపం ఉండేది కాదు.

"ఏమండీ అప్పన్నగారూ! దాదర్ స్టేషన్ కెదురుగా కొత్త హోటల్ ఎప్పుడు తెరిచారండీ." నవ్వుతూ నేను

"నేను తెరవడమేమిటి? అది ఎప్పటినుంచే ఉంటేను ఏళ్ళ నుండి బొంబాయిలో ఉన్నారు. ఆ మాత్రం తెలీదా. ట్యాక్సీకి అనవసరంగా రెండొందలయ్యాయి" అప్పన్న నిష్టూరం.

"మొగున్ని కొట్టి మొగసాల ఎక్కడం" అంటే ఇదేనేమో మనసులో అనుకుని.

"నలభై ఏళ్ళ నుంచి బొంబాయిలో ఉన్న నాకు ఇక్కడి సందులు, గొందులు అన్నీ పరిచయమే. గంటసేపు వెతికినా కనపడని మీ "మేఘదర్శన్" ఎక్కడుందో కాస్త వివరంగా చెప్పడి" నేనూ కాస్త గట్టిగానే అన్నాను.

ఆయన చెప్పిన వివరాలను బట్టి, అదెక్కడో దాదర్ స్టేషన్‌కి దాదాపు కిలో మీటరు దూరంలో శివాజీ పార్కు దగ్గర వుంది. అయినా అప్పన్న మాత్రం 'దాదర్ స్టేషన్‌కి ఎదురుగానే ఉంది' అని వాదిస్తున్నాడు.

"మీరు శివాజీ పార్కు వైపు ఎందుకు వెళ్ళారండీ. అది పడమరవైపు గదా ఉంది. మహాసభనేమో తూర్పున ఉందాయే." మా అధ్యక్షుల ధర్మ సందేహం.

"ఈ బొంబాయిలో తూర్పు - పడమర గోల ఏమిటండీ? ఇన్ని చోట్లు, దేశమంతటా తిరిగాం. ఎక్కడాలేదిది" నూకరాజు అడిగాడు.

"బొంబాయిలో రైలు పట్టాలు దక్షిణం నుండి ఉత్తరంగా ఉంటాయి. వాటికి ఓ వైపు తూర్పైతే, మరోవైపు పడమర. ఆయా ప్రాంతాల్లో ఉన్న పరిసరాలను తూర్పుగా గాని పడమరగా గాని ఉటంకిస్తారు. అడ్రసులో కూడా అదే రాస్తారు. స్టేషన్ పేరు జ్ఞాపకం ఉన్నా, తూర్పో-పడమరో మరచిపోతే ఇక ఇంతే సంగతులు" వివరించాను.

"పరాయి రాష్ట్రం వచ్చేవారు అడ్రసు, ఫోను నెంబరు దగ్గరుంచుకోవాలి గదా, ఖచ్చితంగా ఫలానా చోట్లో ఉన్నానని, ఫలానా పరిసరాల్లో ఉన్నానని అంటే సులువుగా ఉండేదిగదా? ఎక్కడో కిలో మీటరు దూరంలో ఉన్న హోటల్ని, స్టేషన్‌కి ఎదురుగా ఉందని ఉజ్జాయింపుగా చెబితే సరా? ఎంత తిప్పలు మాకు?" మా అధ్యక్షుల వారికోపం ప్రకోపించింది. పరిస్థితి చేయి దాటకముందే అందరినీ భోజనానికి లేవదీశాను.

మర్నాడు నాటక ప్రదర్శన.

రిహార్సలు సరిగా చేయనందున, నటులు పద్యాలు పాడడంలో తడబడ్డారు. నటుల మాటలకి ముందే ప్రాంప్టింగ్ చేసే వారి మాటలే ప్రేక్షకులకు వినిపించాయి. జనం నుంచి ఈలలు, హాలంతా గోల, ప్రదర్శన తుస్సుమంది. మాసమాఖ్య పరువు గంగలో కలిసింది. ఇలాంటి సమాజం వారి నాటకాన్ని ఏర్పాటు చేసినందుకు మా సభ్యుల నుండి చీవాట్లు. నా 'కలాపోసన' బెడిసికొట్టింది.

"ఓ సినిమా కవి అన్నట్టు కుడి ఎడమైతే పొరపాటు లేకపోవచ్చు, కాని బొంబాయిలో తూర్పు - పడమరైతే పాట్లు, అగచాట్లు, చూశారు గదా?" రైలెక్కించడానికి వెళ్ళిన నేను, అప్పన్నతో అన్నాను.

అప్పటికే నల్లబడిన అప్పన్న మొహం మరింత చిన్నబోయింది.

రైలు స్టేషన్ దాటింది. భారంగా నేనూ నా రైలు ప్లాట్‌ఫాం వైపు అడుగులు వేశాను.

నేటినిజం మహాశివరాత్రి ప్రత్యేక అనుబంధం

**2006**